గుర్తింపు లేని పాఠశాలల వివరాలు ఇవ్వాలి

రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ మిషన్ సభ్యులు సీతారాం

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

జిల్లాలో గుర్తింపులేని ప్రయివేటు యాజమాన్యాల పాఠశాలల వివరాలను విద్యా సంవత్సరం ప్రారంభానికి ముందే బహిర్గతం చేయాలని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు గొండు సీతారాం ఒక ప్రకటనలో కోరారు. గుర్తింపు లేని పాఠశాలల్లో చేర్పించడం వల్ల పిల్లల భవిష్యత్ అగమ్యగోచరంగా మారుతుందన్నారు. తల్లిదండ్రులను ఆర్థిక ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు. ఇటువంటి పాఠశాలలపై చట్ట ప్రకారం చర్యలకు ప్రభుత్వానికి సిఫార్సు చేస్తామని హెచ్చరించారు.

- 84,709 మందికి ఇళ్ల వద్ద అందజేత
- 2,38,993 మంది బ్యాంకులకు వెళ్లాల్సిందే
- మండుటెండలో లబ్ధిదారులకు అగ్ని పరీక్షే
- నేటి నుంచి పింఛన్ల పంపిణీ

పింఛను పాట్లు తప్పేనా?

ఎండలు మండిపోతున్నాయి. ఉక్కపోతతో జనం విలవిలాడిపోతున్నారు. గడపదాటి బయటకు రావడానికి బెంబేలెత్తిపోతున్నారు. ప్రభుత్వం మాత్రం వృద్ధులపై కనికరం చూపడం లేదు. ఏప్రిల్‌లో సచివాలయాల వద్ద, మేలో బ్యాంకుల ద్వారా సొమ్ములను అందించిన ప్రభుత్వం జూన్ నెల పింఛన్లనూ బ్యాంకుల వద్దే అందించాలని నిర్ణయించింది. అందుకనుగుణంగా అధికారులు ఏర్పాట్లు చేశారు. వికలాంగులు, అనారోగ్యంతో బాధపడుతున్న వృద్ధులకు మాత్రమే ఇంటికి వెళ్లి ఇవ్వనున్నారు. మే నెలలో బ్యాంకుల వద్ద పంపిణీ చేయడంతో వృద్ధులు ఆపోసోపాలు పడిన విషయం తెలిసిందే. ఎండలు మండుతున్న నేపథ్యంలో బ్యాంకులకు వెళ్లి పింఛన్లు తీసుకోవడం లబ్ధిదారులకు అగ్ని పరీక్ష కానుంది.

ప్రజాశక్తి- శ్రీకాకుళం ప్రతినిధి

జిల్లాలో జూన్ నెలకు సంబంధించి మొత్తం 3,17,702 మందికి పింఛన్లు చెల్లించేందుకు రూ.93.30 కోట్ల సొమ్ము విడుదల చేసింది. వీరిలో 84,709 మందికి చెందిన రూ.21.60 కోట్లను నేరుగా ఇంటికి వెళ్లి అందించనున్నారు. 2,38,993 మంది లబ్ధిదారులకు సంబంధించిన రూ.71.70 కోట్లను వారి ఖాతాల్లో జమచేయనున్నారు. ఎన్నికల ముందు వాలంటీర్ల ద్వారా ఇంటింటికీ పింఛను పంపిణీ చేశారు. ఎన్నికల సమయంలో వాలంటీర్ల ద్వారా డబ్బులు పంపిణీ చేయిస్తే వారు ఓటర్లను ప్రభావితం చేస్తారని టిడిపి నేతలు ఆందోళన వ్యక్తం చేశారు. వారిని విధులకు దూరంగా ఉంచాలని ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేశారు. దీంతో వారిని పింఛను బాధ్యతల నుంచి తప్పించాలని ఎన్నికల సంఘం ఆదేశించింది. టిడిపి ఫిర్యాదుపై మండిపడిన వైసిపి అందుకు విరుగుడు అస్త్రాన్ని ప్రయోగించింది. పింఛన్లు ఇంటికి వెళ్లి అందించే అవకాశం ఉన్నా... ఏప్రిల్ నెల సొమ్ములను సచివాలయాల్లోనే అందించింది. లబ్ధిదారుల ఇబ్బందులకు టిడిపియే కారణమని చెప్పేందుకు ఈ రకంగా వ్యవహరించిదన్న విమర్శలను మూటగట్టుకుంది. మే నెలలో కూడా అదే పద్ధతిలో పింఛన్లను అందించేందుకు ప్రభుత్వం సిద్ధమవ్వగా, టిడిపి అధినేత చంద్రబాబు మళ్లీ ఎన్నికల సంఘానికి లేఖ రాశారు. లబ్ధిదారుల ఇళ్లకు డబ్బులు పంపిణీ చేయాలని కోరారు. ఇంటింటికీ వెళ్లి పింఛను పంపిణీ చేసేందుకు తమకు తగినంత మంది సిబ్బంది లేరంటూ మే నెల సొమ్ములను కొందరికి బ్యాంకు ఖాతాల్లో వేయాలని, మరికొందరికి ఇళ్లకు ఇవ్వాలని నిర్ణయించి ఆ విధంగానే కార్యక్రమాన్ని పూర్తి చేసింది.

లబ్ధిదారుల్లో ఆందోళన

గత నెలలో అత్యధిక మందికి బ్యాంకు ఖాతాల్లోనే డబ్బులను జమ చేశారు. అనారోగ్యంతో ఉన్న వృద్ధులు, వికలాంగులకు మాత్రం ఇళ్లకు వెళ్లి సొమ్ములను అందించారు. పింఛన్ల సొమ్ము తీసుకునేందుకు బ్యాంకులకు వెళ్లిన లబ్ధిదారులు తీవ్ర ఇబ్బందులు చవిచూశారు. మండుటెండలో బ్యాంకుల ముందు పడిగాపులు కాశారు. గొడుగులు, మంచినీళ్ల సీసాలు వెంట తెచ్చుకుని క్యూలైన్లో నిల్చున్నారు. బ్యాంకు ఖాతాల్లో నగదు జమ లబ్ధిదారుల్లో కొద్ది మంది చాలాకాలంగా బ్యాంకు ఖాతాలు వినియోగించకపోవడం బ్యాంకు సేవల ఛార్జీలు పెండింగ్‌లో ఉండిపోయాయి. ప్రస్తుతం ప్రభుత్వం ఖాతాల్లో డబ్బులు వేస్తుండటంతో వాటిలో ఐదారు వందల రూపాయలను కస్టమర్ ఛార్జీల కింద బ్యాంకు అధికారులు జమ చేసుకుంటున్నారు.

నోరెత్తని టిడిపి

వాలంటీర్లు నేరుగా ఇళ్లకు వెళ్లి పింఛను డబ్బులను అందిస్తే వారు ప్రభావితం చేస్తారని గుర్తించిన టిడిపి ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేసింది. వాలంటీర్లను విధుల నుంచి తప్పించేలా చేసింది. దీంతో ప్రభుత్వం ఏప్రిల్‌లో సచివాలయాల వద్ద పింఛన్ల పంపిణీ చేపట్టింది. దీంతో వృద్ధులు, వికలాంగులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. లబ్ధిదారులు ఆగ్రహానికి గురికాకుండా ఉండేందుకు మే నెల పింఛన్లను లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి అందించాలని టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్‌రెడ్డికి లేఖ రాశారు. పింఛన్ల పంపిణీకి తమ దగ్గర చాలినంత సిబ్బంది లేరంటూ కొంతమందికి బ్యాంకుల ద్వారా, మరికొంత మందికి ఇళ్లకు వెళ్లి అందించారు. పోలింగ్ అయిపోవడంతో లబ్ధిదారుల ఇబ్బందులతో తమకింకా పనేమీ లేనట్లుగా టిడిపి వ్యవహరించడంపై అనేక విమర్శలు వినిపిస్తున్నాయి.

వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న ఎస్‌పి జి.ఆర్ రాధిక

ట్రబుల్ మాంగర్లపై ప్రత్యేక దృష్టి

- కౌంటింగ్‌కు పటిష్ట భద్రత
- విశాఖ రేంజ్ డిఐజి విశాల్ గున్ని

ప్రజాశక్తి- శ్రీకాకుళం

కౌంటింగ్ రోజున ఇతరులను రెచ్చగొట్టే వ్యాఖ్యలు, అసత్య ప్రచారాలు చేసే వారిని ముందస్తుగా గుర్తించాలని విశాఖపట్నం రేంజ్ డిఐజి విశాల్ గున్ని అన్నారు. ఈ నెల 4న కౌంటింగ్, ఎన్నికల ఫలితాలు అనంతరం తీసుకోవలసిన చర్యలు, కౌంటింగ్ కేంద్రాల భద్రత, బందోబస్తు ఏర్పాట్లపై ఎస్‌పి జి.ఆర్.రాధికతో విశాఖపట్నం నుంచి వీడియో కాన్ఫరెన్స్ శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఒకేచోట ఎక్కువ ప్రజానీకం గుమ్మిగూడి ఉండకుండా ముందుస్తు చర్యలు చేపట్టి ట్రబుల్ మాంగార్స్‌పై ప్రత్యేక దృష్టిసారించాలన్నారు. కౌంటింగ్ కేంద్రం వద్ద పటిష్ట భద్రతతో పాటు ప్రవేశ మార్గం వద్ద ఎటువంటి అనూహ్య ఘటనలు జరగుండా పీక్‌ఆఫ్ బృందాలను నియమించాలన్నారు.

144 సెక్షన్ మేరకు కౌంటింగ్ కేంద్రాల పరిసర ప్రాంతాల్లో పెట్రోలింగ్ పార్టీలు నిరంతరం గస్తీ చేస్తూ... అల్లరి మూకలు, ప్రజలు గమ్మిగూడి ఉండకుండా నియంత్రణ చర్యలు చేపట్టాలన్నారు. రౌడీషిటర్లపై ప్రత్యేకంగా నిఘా ఉంచాలన్నారు. సామాజిక మాధ్యమాల పోస్టులపై ప్రత్యేక నిఘా ఉంచి, తప్పుడు ఉదంతాలు, సందేశాలు పోస్టులను, అసత్య ట్రోలింగ్‌లను నియంత్రించాలని పేర్కొన్నారు. సమస్యత్మక గ్రామాల్లో పికెట్లు, పెట్రోలింగ్ బృందాలు ఏర్పాటు చేయాలన్నారు. లాడ్జిలు, హోటళ్లను నిరంతరం తనిఖీచేసే కొత్త వ్యక్తులు, పాత నేరస్తులు వివరాలపై ఆరా తీయలన్నారు. కౌంటింగ్ ప్రక్రియ సజావుగా జరిగేలా సిసి కెమేరాలు, డ్రోన్ విజివలన్ ద్వారా నిరంతరం పర్యవేక్షంచాలన్నారు. శాంతియుతంగా కౌంటింగ్ ప్రక్రియ పూర్తియ్యేలా ప్రతి అధికారి, సిబ్బంది బాధ్యతగా విధులు నిర్వహించాలన్నారు. ఎస్‌పి మాట్లాడుతూ మాట్లాడుతూ కౌంటింగ్ రోజున శాంతిభద్రతల పరిరక్షణకు క్యూఆర్టీ, బృందాలు, స్టాటిక్ ఫోర్స్, పికెట్స్, పెట్రోలింగ్ పార్టీలు, షాడో బృందాలు గ్రామాల్లో అనునిత్యం తిరుగుతాయని పేర్కొన్నారు. ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలోని ఏ చిన్న ఘటన జరిగిన తక్షణమే మీకు అందుబాటులో ఉన్న ఫోర్స్‌తో చేరుకొని గొడవలు నియంత్రించాలని సూచించారు. ట్రబుల్ మంగార్స్‌ను ముందస్తుగా గుర్తించి అరెస్టులు చేయాలని సూచించారు. రాజకీయ పార్టీ కార్యాలయాలు పోటీ చేసే అభ్యర్థి ఇళ్ల వద్ద ప్రత్యేక పికెట్ వేసుకోవాలన్నారు. లాడ్జిలు, హోటళ్ల నిరంతరం తనిఖీలు నిర్వహించి కొత్త వ్యక్తులపై నిఘా పెట్టాలని సూచించారు. ప్రతి పోలీస్‌స్టేషన్ పరిధిలో పబ్లిక్ అడ్రస్సింగ్ సిస్టం ఏర్పాటు చేసి ఎటువంటి ఘర్షణలు, అల్లర్లకు పాలుపడాకుండా ప్రజలు శాంతియుతంగా ఉండాలని దిశగా ప్రజలకు అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. రౌడీషీటర్లకు నిరంతరం కౌన్సెలింగ్ నిర్వహించి ఎటువంటి చట్టవ్యతిరేక కార్యకలాపాలలో పాలుపంచుకోకుండా హెచ్చరించాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు ఎస్‌పిలు జి.ప్రేమకాజల్, వి.ఉమామహేశ్వరరావు, డి.గంగాధరం, డిఎస్‌పిలు శృతి, త్రినాథరావు, విజయకుమార్, శేషాద్రినాయడు, సిఐలు సోమశేఖర్, సత్యనారాయణరెడ్డి, అవతారం, సన్యాసినాయిడు, ఉమామహేశ్వరరావు, సూర్యనారాయణ, నిర్మల పాల్గొన్నారు.

కౌంటింగ్ విధులపై సమీక్ష

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

కౌంటింగ్ ప్రక్రియ, అధికారుల చేపట్టాల్సిన విధులు, బాధ్యతలపై కలక్టరేట్‌లో జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్ శుక్రవారం సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల ఫలితాల ప్రకటన కీలక దశకు చేరుకున్నట్టు తెలిపారు. ఇందు కోసం ప్రత్యేకంగా దృష్టిపెట్టి ఎవరూ ఏయే విధులు నిర్వహించాలనే క్రమంలో ఉత్తర్వులు జారీ చేశామన్నారు. ఇప్పటి వరకు ఎన్నికల ప్రక్రియ సజావుగా సాగేందుకు ప్రతిఒక్కరూ అంకితభావంతో విధులను నిర్వర్తించడం అభినందనీయమన్నారు. అదేతీరును కౌంటింగ్ సందర్భంలో కూడా నిర్వర్తించాలని స్పష్టం చేశారు. ముందుగా పోస్టల్ బ్యాలెట్ లెక్కింపు, కౌంటింగ్ సిబ్బంది హాజరు నమోదు, గుర్తింపు కార్డులు జారీ, అంతరాయం లేని విద్యుత్ ఏర్పాట్లు, ఇతర అనుబంధ ఏర్పాట్లు, నివేదికలు, రౌండ్ వారీగా ఫలితాల ప్రకటన కోసం ఎవరు ఏ విధులు చేపట్టలో సమగ్రంగా ఉత్తర్వుల్లో పేర్కొన్నట్లు వివరించారు. విధులను నిర్వర్తించడం లో భాగంగా ఆయా శాఖల అధికారులు వారి సిబ్బందితో కూడి ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కౌంటింగ్ ప్రక్రియలో భాగస్వామ్యమయ్యే ప్రతిఒక్కరికీ ఎటువంటి ఇబ్బందులూ లేకుండా సజావుగా సాగేందుకు బాధ్యతలు కేటాయించిన ఆయా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్, జిల్లా రెవెన్యూ అధికారి ఎం.గణపతిరావు, డిపిఒ వెంకటేశ్వర్లు, చల్లా ఓబులేసు, నాగిరెడ్డి కృష్ణమూర్తి పాల్గొన్నారు.

సమీక్షిస్తున్న జిల్లా ఎన్నికల అధికారి మనజీర్ జిలానీ సమూన్

పలకరించిన వర్షం

ప్రజాశక్తి- జిల్లా విలేకరుల యంత్రాంగం

గత కొద్దిరోజులుగా ఎండ వేడిమికి అల్లాడుతున్న ప్రజానీకానికి శుక్రవారం రాత్రి కురిసిన వర్షం వేసవి తాపాన్ని తీర్చింది. ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులతో కూడిన వర్షంతో వాతావరణంలో ఒక్కసారిగా మార్పులు వచ్చి చల్లదనం ఏర్పడింది. జిల్లాలోని ఇచ్ఛాపురం, కవిటి, సోంపేట, కంచిలి, ఆమదాలవలస, లావేరు మండలాల్లో సుమారు అరగంటకు పైగా కురిసిన వర్షంతో పుడమి పులకించి ప్రకృతి పరవశించింది. రుతుపవనాలు కేరళను తాకిన రెండో రోజే ఉద్దానం ప్రాంతంలో మంచి వర్షం కురవడంపై రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ ఏడాది వర్షపాతం ఆశాజనకంగా ఉంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కొద్దిరోజులుగా 40 డిగ్రీలకు పైబడి ఉష్ణోగ్రతలు నమోదు కావడంతో ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రావడానికే భయపడే పరిస్థితులు నెలకొన్నాయి. ఎండ వేడిమి, ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరి అవుతున్న ప్రజలకు వర్షం ఉపశమనం కలిగింది. మరోవైపు వర్షాల్లేకపోవడంతో ఉద్యానవన పంటలపై ఆ ప్రభావం పడింది. ఉద్దాన ప్రాంతంలో నీరు లేక ఇప్పటికే చాలావరకు కొబ్బరి చెట్లు చనిపోయాయి. ఇటువంటి పరిస్థితుల్లో వర్షం కురవడంతో రైతులు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు.

ఆమదాలవలసలో కురుస్తున్న వర్షం

జిల్లా గుండెచప్పుడు తప్పెటగుళ్లు

వజ్రపుకొత్తూరు : గుంటూరులోని వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో ఉత్తర అమెరికా తెలుగు సంఘం ఆధ్వర్యాన శుక్రవారం నిర్వహించిన జానపద సంబరాల కార్యక్రమంలో రంగం టీం కళాకారులచే తప్పెటగుళ్ల ప్రదర్శన ఆకట్టుకుంది. తప్పెటగుళ్ల కళాకారులు కోనారి హేమసూదన్, పాలిన శంకర్ బృందం ప్రదర్శన ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంది. తప్పెటగుళ్ల కళాకారులను ఉత్తర అమెరికా తెలుగు సంఘం అధ్యక్షుడు నూతి బాపయ్యచౌదరి, ఎమ్మెల్సీ కె.ఎస్.లక్ష్మణరావులు సన్మానించి ప్రశంసాపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శ్రీకాకుళం గుండె చప్పుడు తప్పెటగుళ్ల అన్నారు. తప్పెటగుళ్ల కళతో కళాకారుల సిక్కోలుకు ప్రత్యేక గుర్తింపు తీసుకొచ్చారని అన్నారు. తప్పెటగుళ్ల అనగానే శ్రీకాకుళం కళాకారులు గుర్తుకొస్తారని అన్నారు. అంతరించిపోతున్న జానపద కళలను పరిరక్షించుకోవాలని కోరారు.

ప్రశంసాపత్రం అందుకుంటున్న కళాకారుడు

పొగాకు వినియోగాన్ని రూపుమాపాలి

ర్యాలీని ప్రారంభిస్తున్న ప్రసాదరావు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

పొగాకు వినియోగాన్ని రూపుమాపాలని, పొగాకు వాడకంతో ఎదురయ్యే నష్టాలపై ప్రజల్లో పెద్దఎత్తున అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని అదనపు డిఎంహెచ్ఒ డాక్టర్ ప్రసాదరావు అన్నారు. ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ, జాతీయ పొగాకు నియంత్రణ విభాగం ఆధ్వర్యాన పొగాకు వినియోగానికి వ్యతిరేకంగా శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. ముందుగా డిఎంహెచ్ఒ కార్యాలయం ఆవరణలో ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. ర్యాలీ అనంతరం మానవహారం నిర్వహించి వినియోగానికి వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 20 రోజులపాటు విస్తృత ప్రచారం నిర్వహిస్తునట్టు తెలిపారు. పొగాకు వినియోగం వల్ల వచ్చే అనర్థాలను పిల్లలకు ప్రతి ఇంట్లోని తల్లిదండ్రులు వివరించాలన్నారు. జిల్లాలోని ప్రతి విద్యా సంస్థనూ పొగాకు రహిత విద్యా సంస్థలుగా ప్రకటించాలన్నారు. గ్రామాల్లో పొగాకు వినియోగాన్ని రూపుమాపే దిశగా అవగాహన కార్యక్రమాలను నిర్వహించాలన్నారు. సిగరెట్, పొగాకు ఉత్పత్తుల నియంత్రణ చట్టం- 2003 కఠినంగా అమలు చేయాల్సి ఉందన్నారు. కార్యక్రమంలో ప్రోగ్రాం అధికారులు డాక్టర్ సి.పి.శ్రీదేవి, డిపిఎంఒ లక్ష్మి, డెమో పైడి వెంకటరమణ, డిసిఎం రవిప్రసాద్, సైకాలజిస్టు సురేష్ పాల్గొన్నారు.

చిన్నారులకు ఆటవిడుపు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

వేసవి సెలవుల్లో చిన్నారులకు ఆటవిడుపుగా వారిలో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీసేందుకు వేసవి వినోదం కార్యక్రమం తోడ్పడుతుందని పూర్వ డెప్యూటీ డిఇఒ కొత్తకోట అప్పారావు అన్నారు. క్రియేటివ్ చిల్డ్రన్స్ క్లబ్ ఆధ్వర్యాన శుక్రవారం నగరంలోని యుటిఎఫ్ జిల్లా కార్యాలయంలో వేసవి వినోదం కార్యక్రమాన్ని నిర్వహించారు. పదేళ్ల లోపు వయసు గల 76 మంది చిన్నారులు పాల్గొని సందడి చేశారు.

పరిశీలిస్తున్న డిఎల్‌పిఒ రమణ

సంపద సృష్టి కేంద్రం పరిశీలన

ప్రజాశక్తి- మెళియాపుట్టి

పంచాయతీ పరిధిలో నిర్మించిన చెత్త సంపద కేంద్రాల ద్వారా తడి, పొడి చెత్తతో సంపద సృష్టించుకోవచ్చని టెక్కలి డిఎల్‌పిఒ ఐ.వి.రమణ అన్నారు. మండలంలోని పరుశురాంపురంలో నిర్మించిన చెత్త సంపద సృష్టి కేంద్రాన్ని శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తడి, పొడి చెత్తను వేరుచేసి కంపోస్టు ఎరువును తయారు చేయవచ్చు అన్నారు. వ్యవసాయంలో కూరగాయలు, పళ్ళ తోటల పెంపకంలో ఈ ఎరువు ఉపయోగపడుతుందని అన్నారు. చెత్త సంపద కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని గ్రామస్తులకు సూచించారు. దీనిపై గ్రామాల్లో అవగాహన కల్పించాల్సిన బాధ్యత ఆయా పంచాయతీ కార్యదర్శులదే అన్నారు. ఈ కార్యక్రమాన్ని గ్రామాల్లో చిత్తశుద్ధితో అమలు చేయాలని ఆదేశించారు. ఆయనతో పాటు కార్యదర్శి శివాజీ, విఎఒ శరత్ కుమార్‌రెడ్డి ఉన్నారు.

ఆందోళన చేస్తున్న ఉపాధి కూలీలు

రోడ్కెక్కిన 'ఉపాధి' కూలీలు

- నాలుగు వారాలే పని దినాలు
- సకాలంలో అందని కూలి

ప్రజాశక్తి- బూర్జ

ఉపాధి హామీ కూలీలపై అధికారులు చిన్నచూపు చూస్తున్నారని, పని కల్పించడంలో పూర్తిగా విఫలమయ్యారని కూలీలు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు మండలంలోని లక్కుపురానికి చెందిన కూలీలు శుక్రవారం రోడ్డెక్కారు. పాలకొండ-శ్రీకాకుళం ప్రధాన రోడ్డుపై ధర్నా చేపట్టారు. ప్రభుత్వానికి, అధికారులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా కూలీలు మాట్లాడుతూ వలసలు నియంత్రణకు అమలు చేసిన ఉపాధి హామీ ప్రస్తుతం కొంత మంది వల్ల నిర్వీర్యం అవుతుందని వాపోయారు. ఏడాదిలో వంద రోజులు కార్డుదారునికి పని కల్పించాలని ఉందన్నారు. కానీ, లక్కుపురంలో 3 నుంచి 4 వారాలు మాత్రమే పని కల్పిస్తున్నారని అన్నారు. గ్రామంలో 580 మంది ఉపాధి కూలీలు ఉన్నారని అన్నారు. వీరికి పనులు కల్పించడంలో అధికారులు విఫలమయ్యారని ఆరోపించారు. అలాగే పనికల్పించడంలోనూ తరగతి వివక్ష చూపుతున్నారని వాపోయారు. పనుల కోసం అధికారుల చుట్టూ తిరుగుతున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యారని అన్నారు. వలసలు పోకుండా గ్రామాల్లో ఉన్నామని, పనులు కల్పించకపోవడంతో పస్తులు ఉండాల్సిన పరిస్థితి దాపురించిందని వాపోయారు. పూర్తిస్థాయిలో పనులు కల్పించే వరకూ ఆందోళన చేపడతామని హెచ్చరించారు. జిల్లా కేంద్రానికీ వెళ్లేందుకు వెనకాడబోమని స్పష్టం చేశారు. దీంతో దీంతో సుమారు గంటసేపు వాహనాల రాకపోకులకు అంతరాయం ఏర్పడింది.

సమస్య పరిష్కారానికి కృషి

ఈ విషయంపై డ్వామా పీడీ జి.వి.చిట్టిరాజును వివరణ కోరగా, జాబుకార్డు ఉన్న కూలీలందరికీ ఏడాదికి వంద రోజులు పనిని కల్పిస్తున్నామని అన్నారు. వంద రోజులు పనికల్పించకపోతే అందుకు తగ్గ కూలీ అందించాల్సి ఉంటుందన్నారు. త్వరలో లక్కుపురానికి పనులు కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని హామీనిచ్చారు.

వంద రోజుల పనిదినాలే లక్ష్యం

డ్వామా పీడీ జి.వి చిట్టిరాజు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

ఉపాధి హామీ పథకం సిబ్బంది ప్రధానంగా కూలీలందరికీ వంద రోజులు పనిదినాలు కల్పించడంపైనే దృష్టి సారించాలని జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ జి.వి.చిట్టిరాజు ఆదేశించారు. జిల్లా కేంద్రంలోని కార్యాలయం ఆవరణలో జిల్లాస్థాయి సిబ్బంది శుక్రవారం సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో జరుగుతున్న పనులను రోజూ ఎపిఒ, టిఎ, ఇసి పరిశీలించాలన్నారు. అప్పుడే పనుల్లో నాణ్యత పెరగడంతో పాటు సగటు కూలి రూ.295 చేరుకునే అవకాశాలు ఉంటాయని అభిప్రాయపడ్డారు. పనిప్రదేశాల్లో లక్ష్యాల మేరకు కూలీలు వచ్చేలా క్షేత్రస్థాయిలో లేబర్ మబలైజేషన్ జరగాలని ఆదేశించారు. 6 నుంచి 8 గంటల వరకు క్షేత్రస్థాయిలో చల్లని సమయాల్లో పనులు చేపట్టాలన్నారు. ప్రస్తుతం వర్షాకాలం సమీపిస్తున్న నేపథ్యంలో పంట కాలువల్లో పూడికతీత పనులకు సంబంధించిన పనులు పెద్దఎత్తున చేపట్టాలని సూచించారు. చెరువుల్లో పూడికతీత పనులకు సంబంధించి ఎటువంటి అంచనాలను రూపొందించవద్దని సూచించారు. అందుకు ప్రత్యామ్నాయంగా కొత్త తరహా పనులను గుర్తించి అంచనాలు రూపొందించాలన్నారు. ప్రధానంగా ప్లాంటేషన్, వివిధ రకాల కందకాల పనులు, పంట కాలువల పనులు, ఫిష్ పాండ్స్, ఇతర భూగర్భ జలమట్టాలను పెంపొందింపజేసే పనులను మాత్రమే గుర్తించి ఈ నెల ఏడో తేదీ లోపు జిల్లా కార్యాలయాలకు ఎస్టిమేషన్లు పంపించాలని తెలియజేశారు. . సమావేశంలో ఫైనాన్స్ మేనేజర్ స్వరూపరాణి, ఎపిడిలు లోకేష్, శైలజ, రాధా, మురళీకృష్ణ, కార్యక్రమ అధికారి కె.వి.అప్పలనాయుడు, కార్యాలయ సూపరింటెండెంట్ మురళీధర్ పాల్గొన్నారు.

పరిశీలిస్తున్న జిల్లా జడ్జి జునైద్ అహ్మద్ మౌలానా

జైళ్ల సందర్శన

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

జిల్లా కేంద్రం సమీపాన గల అంపోలు ప్రధాన కారాగారం, నరసన్నపేట సబ్ జైలును జిల్లా జడ్జి జునైద్ అహ్మద్ మౌలానా శుక్రవారం సందర్శించారు. జాతీయ లీగల్ సర్వీసెస్ అథారిటీ, ఎపి స్టేట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ ఆదేశాల మేరకు ఈ తనిఖీలు చేపట్టారు. జైళ్లలో పరిసరాల పరిశుభ్రత, పర్యావరణ పరిరక్షణ, లివింగ్ కండిషన్, ముద్దాయిల యోగక్షేమాలు, వారికి అందుతున్న వైద్యం తదితర అంశాలపై జైలు అధికారులతో, ముద్దాయిలతో మాట్లాడారు. ఆయనతో పాటు జిల్లా జైలుశాఖ అధికారి మోహనరావు, జిల్లా జైలర్ నభీఖాన్, డాక్టర్ సిహెచ్.హరిప్రియ పాల్గొన్నారు.

నేడు రౌండ్‌టేబుల్ సమావేశం

శ్రీకాకుళం అర్బన్ : ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్ల సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యాన శ్రీకాకుళంలో శనివారం రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహిస్తున్నట్టు ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా కార్యదర్శి అలికాన రాజేశ్వరి తెలిపారు. నగరంలోని ఓ ప్రయివేటు భవనంలో సంఘం స్టీరింగ్ కమిటీ సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నగరంలోని గ్రాండ్ హోటల్‌లోని కళ్యాణ మస్తు ఫంక్షన్‌హాల్లో నిర్వహించనున్న ఈ సమావేశానికి రాష్ట్ర అధ్యక్షులు కె.ఆర్.సూర్యనారాయణ హాజరుకానున్నట్టు తెలిపారు. ఆయనతో పాటు ఐక్యవేదిక కోచైర్మన్ కరణం హరికృష్ణ, సెక్రటరీ జనరల్ బాజీపఠాన్, స్టీరింగ్ కమిటీ రాష్ట్ర సభ్యులు హాజరవుతారన్నారు. ఈ సమావేశంలో గత ఐదేళ్లుగా రాష్ట్ర ప్రభుత్వం నాన్చుడు వ్యవహారంగా ఉన్న సిపిఎస్, జిపిఎస్ రద్దు, ఓపిఎస్ పునరుద్ధరణలపై చర్చ జరుగుతుందన్నారు. అలాగే 12వ పిఆర్‌సి సత్వర అమలుతో పాటు సకాలంలో డిఎల చెల్లింపులపైనా చర్చించనున్నట్టు చెప్పారు. ఈ సమావేశానికి పెద్ద ఎత్తున ఉద్యోగ, ఉపాధ్యాయులు, పెన్షనర్లు పాల్గొనాలని కోరారు. సమావేశంలో సభ్యులు కరిమి రాజేశ్వర రావు, శరత్‌బాబు, రాణాప్రతాప్, నారాయణరావు, జయమ్మ, సూర్యచంద్ర, తిరుపతిరావు, కూన వెంకట్ పాల్గొన్నారు.

ప్రారంభిస్తున్న సబ్ కలెక్టర్ నూరుల్ కమర్

క్రికెట్ పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి- టెక్కలి రూరల్
టెక్కలి ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాల మైదానంలో . ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యాన అంతర్ జిల్లాల అండర్-19 నార్త్‌జోన్ క్రికెట్ పోటీలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. ముందుగా సబ్ కలెక్టర్ నూరుల్ కమర్ పోటీలను ప్రారంభించారు. మొదటి మ్యాచ్ శ్రీకాకుళం, తూర్పుగోదావరి జిల్లా మధ్య జరిగిన పోటీలో తూర్పుగోదావరి జిల్లా జట్టు విజయం సాధించింది. మొదట బ్యాటింగ్ చేసిన శ్రీకాకుళం జట్టు నిర్ణీత 50 ఓవర్లలో 167 పరుగులు చేసి ఆలౌట్ అయ్యింది. తరువాత బ్యాటింగ్ చేసిన తూర్పుగోదావరి జట్టు 39.4 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 170 పరుగులు చేసి విజయం సాధించారు.

మాక్‌డ్రిల్ నిర్వహిస్తున్న పోలీసులు

శాంతిభద్రతలపై అవగాహన

ప్రజాశక్తి- టెక్కలి రూరల్
జూన్ 4న ఎన్నికల కౌంటింగ్ నేపథ్యంలో టెక్కలిలో శుక్రవారం పోలీసులు ప్రజలకు శాంతిభద్రతల పరిరక్షణపై అవగాహన కల్పించారు. ముందస్తు చర్యల్లో భాగంగా అల్లర్లు, ధర్నాలు, ఇతర నిరసన కార్యక్రమాలపై డిఎస్‌పి డి.బాలచంద్రారెడ్డి ఆధ్వర్యాన పోలీసులు, అగ్నిమాపకశాఖ, సాయుధ బలగాలు, ఇతర సిబ్బంది మాక్ డ్రిల్ నిర్వహిస్తూ... బాష్పవాయువు ప్రయోగించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సిఐ వల్ల పైడయ్య, ఎస్ఐలు, లక్ష్మి, వి.వెంకటేశ్వరరావు, ఎస్‌ఐ పాల్గొన్నారు.

ఓపెన్ 'పది' కేంద్రం మార్పు

టెక్కలి : ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం ఆధ్వర్యాన నిర్వహిస్తున్న ఓపెన్ పది పరీక్షల కేంద్రం మార్పు చేశారు. దీంతో విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జూన్ 1 నుంచి 8 వరకు ఈ పరీక్షలు జరగనున్నాయి. ఇటువంటి నేపథ్యంలో కేంద్రం మార్పడం గమనార్హం. గడచిన కొద్ది సంవత్సరాలుగా టెక్కలిలో ఓపెన్ పది పరీక్షల సప్లిమెంటరీ పరీక్షా కేంద్రంఉండేది. కానీ, ఈసారి ఎందుకో టెక్కలి నుంచి కాశీబుగ్గ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు మార్పు చేశారు. దీంతో అసౌకర్యానికి గురవుతామేమోనని విద్యార్థులు మదనపడుతున్నారు. ఏటా కాశీబుగ్గ, టెక్కలిలో ఓపెన్ పది సప్లిమెంటరీ పరీక్షా కేంద్రం ఉండేది. కానీ, ఈసారి జిల్లా విద్యాశాఖాధికారులు టెక్కలి కేంద్రాన్ని రద్దు చేస్తూ... కాశీబుగ్గ కేంద్రం ఒక్కటే ఉంచడంపై పలువురు పలు సందేహాలను వ్యక్తం చేస్తున్నారు. డివిజన్ కేంద్రమైన టెక్కలిలో పది సప్లిమెంటరీ పరీక్షా కేంద్రాన్ని రద్దు చేయడంతో టెక్కలి, కోటబొమ్మాళి, సంతబొమ్మాళి మండలాలకు చెందిన విద్యార్థులకు ఇబ్బందులు తప్పేటట్లు లేదు. ఎన్నడూ లేనిదింగా టెక్కలిలో ఓపెన్ పది సప్లిమెంటరీ పరీక్షా కేంద్రం మార్పు చేయడంలోని అంతర్యం ఏమిటో అంతుచిక్కడం లేదని విద్యార్థులు వాపోతున్నారు.

రైతు ఉత్పత్తిదారుల కంపెనీలతో గిట్టుబాటు

ప్రజాశక్తి- బూర్జ
రైతు ఉత్పత్తిదారుల కంపెనీ వలన గ్రామీణ ప్రాంతాల్లో పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పించడంతో పాటు ఉత్పత్తిదారుల కంపెనీలు ఏర్పాటు చేయడం వలన గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలు కల్పించడం జరుగుతుందని డిడిఎం టి. నాగార్జున అన్నారు. శుక్రవారం మండలంలోని పెద్దపేట అర్హీ స్వచ్ఛంద సంస్థ కార్యాలయంలో అర్హీ సంస్థ, నాబార్డ్, ఎన్‌సిడిఎస్ సహాయంతో రైతు ఉత్పత్తిదారుల కంపెనీల సిఇఒలు, అకౌంటెంట్‌లకు నిర్వహించిన ప్రత్యేక శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతు ఉత్పత్తిదారుల కంపెనీ వలన చిన్న, సన్నకారు రైతులకు మార్కెటింగ్ సదుపాయాలు కల్పించడం, వస్తువుల విలువ ఆధారిత శిక్షణ కార్యక్రమాలు, గ్రామీణ ప్రాంతాల్లో గిడ్డంగి సదుపాయాలు, ఎరువులు, ఇన్‌పుట్ సదుపాయాలు అందించడం జరుగుతుందన్నారు. ఆదివాసీ ప్రాంతాల్లో అడవులను అభివృద్ధి చేస్తూ అటవీ ఫలసాయ మెళకువల అభివృద్ధి చేయాలని సభ్యులకు తెలిపారు. అర్హీ సంస్థ డైరెక్టర్ సూర సన్యాసిరావు, పాలకొండ సబ్ డివిజన్ సంజయ్, అనూప్ ఎఫ్‌పిఒ కో-ఆర్డినేటర్ శంకరరావు పాల్గొన్నారు.

నాణ్యమైన ఆహారం అందించాలి

రణస్థలం: మధ్యాహ్న భోజన పథకంలో విద్యార్థులకు పోషక విలువలతో కూడిన ఆహార పదార్థాలు అందించాలని ఎంఇఒలు ఎ.త్రినాథరావు, బి.లావణ్య పిలుపునిచ్చారు. శుక్రవారం రణస్థలం జెడ్‌పి ఉన్నత పాఠశాలలో మండల విద్యాశాఖాధికారులు, మాస్టర్ ట్రైనర్ కె.సుశీల ఆధ్వర్యంలో నిర్వహించిన మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకుల ఒక్కరోజు శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పిల్లలకు రుచికరమైన భోజనం అందించాలని, వంటగది పరిసరాలు, భోజనం పంపిణీ చేసే ప్రదేశాలు, నిర్వాహకుల పరిశుభ్రత విషయంలో తీసుకోవలసిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులు, సిఆర్‌పిలు పాల్గొన్నారు.

చింతామణి ట్రస్టు సేవలు అభినందనీయం

కవిటి: ఆర్థిక సమస్యలతో చదువుకు ఇబ్బంది పడుతున్న వారికి అండగా నిలిచి, ఎంతోమంది విద్యార్థుల చదువుకు చేయూత అందిస్తున్న చింతామణి అమ్మవారి ట్రస్టు సేవలు అభినందనీయమని సర్పంచ్ పూడి లక్ష్మణరావు కొనియాడారు. మండలంలోని చిన్నపుర గోవిందపుట్టుగకు చెందిన యర్ర మీన అనే నర్సింగ్ విద్యార్థి మూడో సంవత్సరం చదువు నిమిత్తం రూ.40 వేలును పెద్దల సమక్షంలో శుక్రవారం అందించారు. నిరుపేద కుటుంబానికి చెందిన మీన చదువులో ఎంతో ప్రతిభ చూపించడంతో గత రెండేళ్ల కూడా చింతామణి ట్రస్టు మీన కళాశాల ఫీజుతో పాటు హాస్టల్ ఫీజు కూడా చెల్లించింది. దానికి కొనసాగింపుగా మూడో ఏడాది కళాశాల ఫీజుతో పాటు హాస్టల్ ఫీజు అవసరానికి అందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ యువజన సంఘం అధ్యక్షుడు పాండవ చంద్రశేఖర్, అగ్నికుల క్షత్రియ సంఘం నాయకుడు పొట్నూరు లక్ష్మణమూర్తి, వైసిపి నాయకుడు బెందాళం రామమూర్తి, పిన్నింటి జయరాం, జన్ని లోకనాథం పాల్గొన్నారు.

పనుల వద్ద ఫీల్డ్ అసిస్టెంట్లు ఉండాలి

మెళియాపుట్టి: ఉపాధి పనుల వద్ద ఫీల్డ్‌అసిస్టెంట్లు ఉండడం లేదని వసుంధర ఎంపిటిసి సలాన చిట్టి అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. స్థానిక ఎన్‌ఆర్‌జిఎస్ కార్యాలయంలో ఎంపిపి రాణా ఈశ్వరమ్మ అధ్యక్షతన శుక్రవారం మండల సమావేశం నిర్వహించారు. అలాగే చాపరలో తాగునీటి సమస్య వెంటాడుతుందని సర్పంచ్ జోసి రామారావు సభ దృష్టికి తీసుకొచ్చారు. మెళియాపుట్టిలో పశువైద్యుల లేకపోవడంతో వైద్య సేవలు కొరవడుతున్నాయని ఎంపిటిసి ప్రతినిధి జయమనిరావు చెప్పారు. ప్రభుత్వ పాఠశాలల్లో బడిఈడు పిల్లలను చేర్పించాలని ప్రజాప్రతినిధులకు ఎంఇఒ ఎస్.దేవేంద్రరావు కోరారు. ఎంపిడిఒ జి.భాస్కరరావు, జెడ్‌పిటిసి గూడ ఎండయ్య, వైస్ ఎంపిపి ఎస్.ఆదినాయుడు, ట్రైకార్ రాష్ట్ర డైరెక్టర్ ప్రతినిధి ఎస్.సుభాష్, ఎంఇఒ-2 ఎం.పద్మనాభరావు, మండల ఎఒ దానకర్మద్ధు, ఎపిఒ ప్రతినిధి పురుషోత్తం, ఐసి అధికారులు పాల్గొన్నారు.

అండర్-15 క్రికెట్‌కు నిఖిలసాయి ఎంపిక

ఇచ్ఛాపురం : ఇచ్ఛాపురంలోని బెల్లుపడ కాలనీకి చెందిన దల్లి నిఖిల్ సాయి అండర్-15 మహిళా జిల్లా క్రికెట్ జట్టుకు ఎంపికయ్యారు. హైదరాబాద్‌లో జీనస్‌లర్ క్రికెట్ అకాడమి స్పాన్సర్‌తో శిక్షణ తీసుకుని మెళకువలను నేర్చుకున్నారు. తన వ్యక్తిగత శిక్షకుడు స్థానిక బిసిసి క్రికెట్ క్లబ్ కోచ్ డి.గోపి వద్ద శిక్షణ తీసుకున్నారు. ఈమె ఎంపికపై స్థానికులు అభినందించారు.

అమ్మో..! జూన్..!!

- సామాన్య, మధ్య తరగతి ప్రజల్లో గుబులు
- ఆర్థ సంవత్సరంలో ఆర్థిక ఇబ్బందులు

ప్రజాశక్తి- టెక్కలి
మధుసూదనరావు ఒక ప్రయివేట్ కంపెనీలో చిరుద్యోగి. నెలకు రూ.28 వేలు జీతం, భార్య లలిత గృహిణిగా ఉంటూ సంసారాన్ని గుట్టుచప్పుడు కాకుండా నెట్టుకొస్తుంది. ఆత్మ, మమతతో కలిసి ఉండడంతో భర్త సంపాదన అరకొరగా ఉన్నప్పటికీ కుటుంబాన్ని తన నైపుణ్యంతో నడుపు కొస్తుంది. జూన్ నెల పాఠశాలలు తెరవడంతో పెద్ద పిల్లవానికి స్కూల్‌లో జాయిన్ చేయాలను కున్నారు. స్కూల్‌ఫీజు, యూనిఫాం, పుస్తకాలు, షూస్, సంచి, వంటి విద్యా సామాగ్రి కొనుగోలుకు రూ.10వేలు అవసరం పడింది. ఏమిచేయాలో పాలుపోని పరిస్థితి. ప్రవీణ్ ఒక బిల్డర్ వద్ద సూపర్‌వైజర్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు. తన ఏకైక కుమారుడు 5వతరగతి పూర్తి చేయడంతో ఉన్నత విద్య అభ్యసన కోసం కార్పొరేట్ స్కూల్‌లో జాయిన్ చేయాలనుకున్నాడు. ఫీజులు, పుస్తకాలు ఐస్‌ఫీజు వంటి వాటిని తట్టుకోవడానికి ఆర్థికంగా వెనుకబడిన వాడు. అయితే సమాజంలో తన కుమారుడికి మంచి విద్యని అందివ్వాలని భావించి తప్పనిసరి పరిస్థితుల్లో జాయిన్ చేశాడు. కానీ ఆర్థిక పరమైన చిక్కులు.

సుశీల భర్త కార్పెంటర్‌గా పనిచేస్తు కరోనా సమయంలో మరణించాడు. అప్పటి నుంచి తన ఇద్దరు పిల్లల్ని ఏదో విధంగా నెట్టుకొస్తుంది. ఇటీవలే పెద్దకుమార్తె రజస్వల అయితే కుటుంబం పెద్దరి కావడంతో ఉన్నదాంట్లో వోణి వేడుక నిర్వహించింది. ప్రస్తుత ధరల నేపథ్యంలో రూ. లక్ష అప్పు చేసి వెచ్చించింది. ఇప్పుడు ఇద్దరు పిల్లలను ఉన్నత చదువుల కోసం స్కూల్‌లో జాయిన్ చేయాలి.

మోహనరావు రెండు ఎకరాల రైతు. మధ్యతరగతి కుటుంబీకుడు. గడచిన నాలుగు నెలల కితం అమ్మిన ధాన్యం డబ్బులు ఖర్చు అయిపోయాయి. జూన్ నెల రావడంతో తొలకరి జల్లులు కురిస్తే దుక్కులు చేయడానికి వ్యవసాయ పనులు ప్రారంభించడానికి డబ్బులు అవసరం. చేతిలో చిల్లిగవ్వలేదు. ఉన్నదాంట్లో పిల్లల చదువులకు, పెద్దకుమార్తె పెళ్లికి వెచ్చించాడు. ఇప్పుడు వ్యవసాయం చేయాలంటే డబ్బులు అవసరం. ఏమి చేయాలో తెలియని పరిస్థితి.

ఇలా చెప్పుకుంటూ పోతే సమాజంలో పాలుపంచుకొంటున్న సామాన్య, మధ్యతరగతి కుటుంబీకులు ఆర్థిక పరిస్థితి ఆర్థ సంవత్సరం అంటే జూన్ నెల ఆర్థిక సంక్షోభం వెంటాడుతుంది. పేదరిక ధరలతో కుటుంబాలను నెట్టుకొవడానికి పడుతున్న ఇబ్బందులు. ఆకలికి ఉండలేక మరోకరి వద్ద చేయి చాపి అడగలేక పలు అవస్థలను ఎదుర్కొంటున్నారు. ఉన్నదాంట్లో కుటుంబాలను నెట్టుకొచ్చే క్రమంలో అప్పుల కోసం ఆరాట పడుతున్నారు. నూటికి మూడు రూపాయలు చొప్పున్న అప్పులు వాడే పరిస్థితులు దాపురిస్తున్నాయి. మరికొన్ని కుటుంబాల వారు దాచుకుంటున్న డబ్బులు వాడుకోవడానికి సిద్ధపడుతుండగా మరి కొన్ని కుటుంబాల వారు మాత్రం చీటి సొమ్ము కోసం అధిక పాటలు పాడాల్సిన పరిస్థితి ఏర్పడింది. రోజురోజుకు పెరుగు తున్న నిత్యావసర వస్తువుల ధరలను తట్టుకోలేక సామాన్య, మధ్య తరగతి కుటుంబాల వారు ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో ప్రతిఒక్క కుటుంబానికి జూన్ నెలంటే గుండెల్లో గుబులు రేగుతుంది. అందుకే ఆర్థిక సంవత్సరంలో ఆర్థ సంవత్సరం వచ్చిన జూన్ నెల అంటే సామాన్య, మధ్య తరగతి ప్రజలకు వణుకు పుడుతుంది.

బిల్లులు చెల్లించాలి

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం
సొంత డబ్బులతో మున్సిపాలిటీ వార్డులను అభివృద్ధి చేశామని, దానికి సంబంధించిన బిల్లులు చెల్లించాలని అధికార పార్టీ వైసిపి కౌన్సిలర్ ప్రదీప్ కోరారు. మున్సిపల్ కార్యాలయంలో చైర్‌పర్సన్ పిలక రాజ్యలక్ష్మి అధ్యక్షతన శుక్రవారం కౌన్సిల్ సాధారణ సమావేశం నిర్వహించారు. 23వ వార్డులో గతేడాది చేపట్టిన అభివృద్ధి పనులకు సంబంధించి రూ.2 లక్షలకు పైగా నిధులు చెల్లించలేదని అధికారుల తీరుపై మండిపడ్డారు. రాజ్యలక్ష్మి

మాట్లాడుతున్న రాజ్యలక్ష్మి

మాట్లాడుతూ ఇది సందర్భంగా కాదని, సాంకేతిక సమస్యలు వల్ల జాప్యం జరుగుతుందని అన్నారు. వర్షాకాలం వస్తుందని, కాలువల్లో పేరుకుపోయిన బురద, మట్టి తొలగించే చర్యలు తీసుకోవాలని టిడిపి కౌన్సిలర్ ఆసీ లీలారాణి కోరారు. వేసవిలో తాగునీరు ఇబ్బంది లేకుండా ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా పెంచాలని కోరారు. కౌన్సిల్ సమావేశం మందిరం సుందరీకరణ చేయాల ని మూడేళ్ల క్రితం కౌన్సిల్ సమావేశంలో కోరితే ఇప్పటి వరకు పనులు ఎందుకు నోచుకోలేదని వైస్ చైర్‌పర్సన్ లాభాల స్వర్ణమణి అధికారుల తీరుపై మండిపడ్డారు. పురపాలక మానపత్రిక కోసం సాధారణ నిధులు నుంచి రూ.30 వేలు ఎలా ఖర్చు చేశారని ప్రశ్నించారు. మానపత్రికలో అభివృద్ధిపై అభినందన పేరిట ప్రకటన ఇవ్వడం హాస్యాస్పదంగా ఉందన్నారు. సమావేశంలో వైస్ చైర్‌పర్సన్ ఉలాల భారతిదివ్య, కో-ఆప్షన్ సభ్యులు సయ్యద్ సుల్తాన్, ప్రత్తి విజయకుమార్, ఇన్‌ఛార్జి కమిషనర్ టి.పి.ఎస్.నారాయణరావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఉపేంద్ర పాల్గొన్నారు.

ఐటిఐలో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్
జిల్లాలో గల ప్రభుత్వ ఐటిఐల్లో వివిధ ట్రేడుల్లో శిక్షణ కోసం ఈ విద్యాసంవత్సరానికి నోటిఫికేషన్ విడుదలైనట్లు డి.ఎల్.టి.సి వై.రామ్మోహనరావు ఒక ప్రకటనలో తెలిపారు. అర్హతను పొందడానికి పదవ తరగతి ఉత్తీర్ణత సాధించిన వారు అర్హులని తెలిపారు. ఎలక్ట్రీషియన్, ఫిట్టరు, ఎలక్ట్రానిక్ మెక్, ఇన్స్ట్రుమెంట్ మెకానిక్, డ్రాఫ్ మెన్ సివిల్, వెల్డర్, కోప(కంప్యూటర్‌కోర్సు), కటింగ్ అండ్ సూయింగ్(ట్రెయిలరింగ్ కోర్స్ ఆడవాళ్లకు) మొదటి దఫా అడ్మిషన్లకు రిజిస్ట్రేషన్ వెరిఫికేషన్ ప్రభుత్వ డి.ఎల్.టి.సి/ ప్రభుత్వ ఐటిఐల ప్రత్యేక కౌంటర్లలో జూన్ 10 వరకు జరుగుతుందని, మొదటి దఫా కౌన్సిలింగ్ జూన్ 18 నుంచి 26 వరకు ఎన్నికల ప్రభుత్వ ఐటిఐలో నిర్వహించనున్నట్లు తెలిపారు. మరిన్ని వివరాలకు డిఎల్‌టిసిని సంప్రదించాలన్నారు.

ఎంపిడిఒకు సన్మానం

నందిగాం : స్థానిక ఎంపిడిఒగా పనిచేస్తున్న జి.శివప్రసాద్ శుక్రవారం స్వచ్ఛంద ఉద్యోగ విరమణ పొందారు. దీంతో స్థానిక ప్రయివేటు కళ్యాణ మండపంలో మండల పరిషత్, గ్రామ సచివాలయ సిబ్బంది ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి రాజారావు, కార్యదర్శులు సంతోష్‌కుమార్, చంద్రశేఖరరావు పాల్గొన్నారు.

మొక్కలు నాటుతున్న జడ్జి ప్రసన్నలత

పర్యావరణ పరిరక్షణకు కృషి

కోటబొమ్మాళి: పర్యావరణానికి మొక్కలు చెట్లుగా మారి వాటి ద్వారా వచ్చే ఆక్సిజన్ ప్రాణ రక్షణకు ఉపయోగ పడుతుందని, పర్యావరణ కాలుష్యాన్ని నివారిస్తుందని జూనియర్ సివిల్ జడ్జి బి.ఎన్.వి.ప్రసన్నలత అన్నారు. కోర్టు ఆవరణలో శుక్రవారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతిఒక్కరూ ఎన్నిమాగా సంఖ్యలో మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణ కృషి చేయాలని అన్నారు. బార్ అధ్యక్షులు లాభిసెని శ్రీనివాసులు, బార్ సెక్రటరీ తిరుమలరావు, ఎపిపి హరిప్రియ, ఎజిపి ఎస్.తిరుపతి, కోర్టు సూపరింటెండెంట్ ముద్దాడ వెంకటరావు, కానిస్టేబుళ్లు బాలకృష్ణ, అశోక్, వెంకటరావు పాల్గొన్నారు.

రేపు విద్యుత్ సరఫరా నిలుపుదల

పలాస : పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో ఆదివారం ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు విద్యుత్ శాఖ ఇఇ జి.ప్రసాదరావు ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ పనులు చేపట్టేందుకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని, కాశీబుగ్గ శ్రీనివాస్ నగర్, రోటరీ నగర్, నెహ్రూనగర్, నిత్యానంద నగర్, ఎంపిడిఒ కార్యాలయం ప్రాంతం తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాను నిలిపి వేస్తున్నట్లు తెలిపారు.

హెచ్‌ఎంకు సన్మానం

టెక్కలి : మండలంలోని తలగాం ఎట్ నౌపడా ఆర్‌ఎస్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు అంగూరు ధర్మారావు శుక్రవారం ఉద్యోగ విరమణ చేశారు. పాఠశాల ఉపాధ్యాయులు ధర్మారావును సన్మానించారు. విధి నిర్వహణలో ఉపాధ్యాయుని పాత్రపై పలువురు సందేశాన్ని అందించారు. ఇన్‌ఛార్జి హెచ్‌ఎం ఎన్. కృష్ణారావు, ఉపాధ్యాయులు విద్యాధరి, రమేష్, లత, శ్రీనివాసరావు, రాజేశ్వరి, డిల్లేశ్వరి, శివకాశి పాల్గొన్నారు.

ఆస్పత్రికి రోగుల తాకిడి

పొందూరు: వేసవి నేపథ్యంలో రోజురోజుకూ పెరుగుతున్న ఎండల తీవ్రతకు ప్రజలు వడదెబ్బతో పాటు ఇతర ఆరోగ్య సమస్యలతో మండల కేంద్రంలోని ప్రభుత్వ సామాజిక ఆస్పత్రికి రోగుల తాకిడి పెరుగుతుంది. ముఖ్యంగా డయేరి యాతో రోజూ పదుల సంఖ్యలో రోగులు చికిత్స కోసం ఆస్పత్రికి వస్తున్నారు. మండలంలో పాటు సమీపంలో గల జి.సిగడాం, సంతకవిటి, లావేరు మండలాలకు చెందిన రోగులు ఆస్పత్రికి వస్తున్నారు. ఈ సందర్భంగా ఆస్పత్రి సూపరింటెండెంట్ రామదాసు మాట్లాడుతూ ఆస్పత్రిలో వడదెబ్బ, డయేరి యాలకు సంబం ధించి అవసర రమైన మందులు సిద్ధంగా ఉంచామని తెలి పారు.

ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రోగులు

మాట్లాడుతున్న ఎంపిడిఒ సూర్యనారాయణ

మొక్కుబడిగా మండల సమావేశం

ప్రజాశక్తి- పొందూరు
మండల పరిషత్ కార్యాలయం సమావేశ మందిరంలో ఎంపిపి కిల్లి ఉషారాణి అధ్యక్షతన శుక్రవారం నిర్వహించిన మండల పరిషత్ సర్వసభ్య సమావేశం తూతూ మంత్రంగా సాగింది. ఎన్నికల కోడ్ అమల్లో ఉండటంతో శాఖలపై ఎటువంటి సమీక్ష చేపట్టలేదు. రాష్ట్రంలో వేగంగానే రుతుపవనాలు ప్రవేశించి వర్షాలు కురవనున్నట్లు వాతావరణ శాఖ చెబుతుందని, ఖరీఫ్ సీజన్‌కు రైతులకు అవసరమైన విత్తనాలు సంసిద్ధతపై చర్చించి ఉంటే బాగుండేదంటూ పలువురు సభ్యులు ఎంపిడిఒ సిహెచ్.సూర్యనారాయణ దృష్టికి తీసుకువచ్చారు. ఇప్పటికే మండలానికి కావాల్సిన వరివిత్తనాలకు ఇండెంట్ ఇవ్వామని వ్యవసాయశాఖ అధికారులు ఎంపిడిఒకు తెలిపారు. అనంతరం మూడు నెలల ఆదాయ, వ్యయాలపై సభలో చర్చించారు. సమావేశంలో పిఎసిఎస్ అధ్యక్షులు కొండాడ రమణమూర్తి, ఎంపిపి వైస్ ప్రెసిడెంట్ సునీల్‌కుమార్, మాజీ ఎంపిపి కూన ప్రమీల, వైస్‌ఎంపిపి వండాన శ్రీదేవి, ఎంపిటిసిలు కిల్లాన సూర్యారావు, బాడాన హరిక, ఇఒపిఆర్‌డి సింహాచలం, ఎంఇఒలు రామారావు, రాజారావు, ఎపిఎం శ్యామలరావు, ఎఒ బాల్జీ, ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ చైతన్య, పలువురు ఎంపిటిసిలు, సర్పంచ్‌లు, అధికారులు పాల్గొన్నారు.

ధూమపానం ప్రాణాంతకం

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్
ధూమపానం ప్రాణాంతకమని, ప్రపంచవ్యాప్తంగా ధూమపానం వలన మరణాల సంఖ్య పెరుగుతోందని లైన్స్‌క్లబ్ సెంట్రల్ అధ్యక్షులు పొన్నాడ రవి కుమార్ అన్నారు. శుక్రవారం నగరంలోని పెద్ద మార్కెట్ ప్రాంతంలో ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా లైన్స్‌క్లబ్ సెంట్రల్ శ్రీకాకుళం ఆధ్వర్యంలో పొగాకు వాడకంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ధూమపానం వలన శ్వాసకోశ వ్యాధులు, గుండె జబ్బులు, కంటి శుక్లాలు, కేన్సర్ వంటి తీవ్రమైన వ్యాధులకు దారి తీస్తుందని, సిగరెట్ పొగ శరీరంలోకి ప్రమాదకరమైన రసాయనాలు విడుదల చేస్తుందని ప్రాణాలను బలితీసుకొని జీవితాలను నాశనం చేస్తోందన్నారు. కుటుంబాన్ని దూరం చేస్తుందని, ధూమపానానికి యువత ఎక్కువగా బానిసలవు తున్నారన్నారు. పొగాకు వాడకానికి దూరంగా ఉండాలంటే చాలా మార్గాలు న్నాయని, అవి తప్పక పాటిస్తే జీవితం సుఖవంతమవుతుందన్నారు. కార్యక్రమంలో ప్రముఖ వైద్యులు బొడ్డేపల్లి సురేష్ కుమార్, డాక్టరు పైడి సింధూర హాజరై పొగాకు వాడకం వలన ఎదురయ్యే నష్టాలను వివరించారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ విష్ణుమూర్తి

అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న రవికుమార్

తదితరులు హాజరయ్యారు.

పలాస : పొగాకు వాడడం ద్వారా ప్రజలు అనారోగ్య పాలవుతున్నారని గ్రీన్‌ఆర్మీ అధ్యక్షుడు బోనెల గోపాల్, రెండికోట ఆస్పత్రి ప్రైవ్యాధికారి టి.సునీల్‌కుమార్ అన్నారు. మండలంలోని రెంటికోట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద ప్రపంచ పొగాకు దినోత్సవం వేడుకలను ఘనంగా నిర్వహించారు. పొగాకు ఇతర ఉత్పత్తులు వాడను, నేను, నా కుటుంబ సభ్యులు, స్నేహితులు పరిచయస్తులను ఎటువంటి పొగాకు ఉత్పత్తులు వినియోగించకుండా చూస్తానని ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ మౌనిక, పిహెచ్‌ఎన్ సత్యవతి, హెల్త్ సూపర్‌వైజర్ ఎస్.రుక్మిణీరావు, సుదర్శన్, ఫార్మసీ ఆఫీసర్ బోనెల గోపాల్, కమల, హేమలత, మేరీ సరస్వతి, రోజా, భరద్వాజ్, నిహారిక, సీలవతి, తేజ, పావని, తేజస్విని, సుధ, ఆశాదేవి తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి కొత్త మోటారు వాహన చట్టం అమలు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్
జూన్ ఒకటి నుంచి కొత్త మోటారు వాహన చట్టం అమల్లోకి వచ్చిందని, నగర ప్రజలంతా ట్రాఫిక్ నిబంధనలు తప్పక పాటించాలని ట్రాఫిక్ సిఐ ఎం.అవతారం అన్నారు. శుక్రవారం ట్రాఫిక్ సర్కిల్ కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడారు. మైనర్లకు వాహనాలను ఇస్తే కొత్త నిబంధన ప్రకారం జరిమానాతో పాటు జైలు శిక్ష తప్పదని, ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. మైనర్లు వాహనాలు నడిపితే రూ. ఇరవై ఐదు వేలు వరకు జరిమానా విధించవచ్చన్నారు. మద్యం సేవించి వాహనాన్ని నడిపితే 6 నెలల జైలు, రూ.పది వేల అపరాధ రుసుం చెల్లించక తప్పదన్నారు. అలాగే ట్రాఫిక్ సిగ్నల్స్ ప్రాంతాల్లో

సిఐ అవతారం

సిగ్నల్ దాటినా, వాహనాలు నడిపేటప్పుడు ఫోన్‌లో మాట్లాడినా, హెల్మెట్ లేకుండా వాహనాలు నడిపినా చర్యలు తప్పవన్నారు. హెల్మెట్ వినియోగం వలన ప్రమాదాల బారినుంచి బయటపడవచ్చని, గమ్యానికి తొందరగా చేరుకోవాలనే తపనతో అతి వేగంగా వాహనాలను నడిపి మన ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దని సూచించారు. కొంత సేపు ఆలస్యమైనా సురక్షిత ప్రయాణం మేలు చేకూరుస్తుందన్నారు. నగరంలో యువత అతి వేగంగా వాహనాలు నడుపుతూ ప్రమాదాలు కొని తెచ్చుకుంటున్నారని, కొందరైతే బైక్ రేసింగ్ అంటూ అతివేగంతో నడపి తల్లిదండ్రులకు తీరని శోకాన్ని మిగిలిస్తున్నారన్నారు. ప్రతిఒక్కరు ట్రాఫిక్ నిబంధనలు తప్పక పాటించాలని సూచించారు.

నేడు యూనియన్ బ్యాంకు రిటైల్ ఎక్స్ పో

శ్రీకాకుళం అర్బన్ : యూనియన్ బ్యాంక్ ఆధ్వర్యంలో జూన్ 1న నిర్వహించనున్న రిటైల్ ఎక్స్‌పో కార్యక్రమాన్ని రిటైల్ ఖాతాదారులు వినియోగించుకోవాలని యూనియన్ బ్యాంక్ రీజనల్ ఆఫీసర్ ఎం.వెంకట తిలక్ కోరారు. నగరంలోని వెంకటాపురం యూనియన్ బ్రాంచ్‌లో శుక్రవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ యూనియన్ బ్యాంక్ గత ఏడాది రిటైల్ రుణాలు రూ.150 కోట్ల మేర అందజేసినట్లు తెలిపారు. ఈ ఏడాది రూ. 200 కోట్ల మేర రుణాలు అందజేయడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని వివరించారు. జిల్లాలో అన్ని బ్యాంకులకు యూనియన్ బ్యాంక్ లీడ్ బ్యాంకు ఉందని చెప్పారు. ఖాతాదారులకు మెరుగైన సౌకర్యాలు అందించేందుకే ఈ రిటైల్ ఎక్స్‌పో నిర్వహిస్తున్నట్లు వివరించారు. అతి తక్కువ వడ్డీకే గృహ రుణాలు, మోటార్ వెహికల్ లోన్స్, టూవీలర్ లోన్స్ అందజేస్తామని, అలాగే విద్యార్థులు తమ విద్యాభివృద్ధికి ఎటు వంటి సెక్యూరిటీ లేకుండా రూ.40 లక్షల వరకు రుణం అందజేయనున్నట్లు తెలిపారు. ఈఎక్స్‌పోను బ్యాంకు విశాఖ జోనల్ హెడ్ శాలిని మెనోన్ ప్రారంభిస్తారని తెలిపారు. శనివారం ఒక్కరోజు నిర్వహించే రిటైల్ ఎక్స్ పో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు కొన సాగుతుందన్నారు. ఈఎక్స్‌పోలో ప్రముఖ బిల్డర్స్, కారు డీలర్లు, ఎడ్యుకేషన్ కన్సల్టెన్సీలు, వివిధ బ్యాంకు అధికారులు హాజరు కానున్నట్లు తెలిపారు. రిటైల్ ఖాతా దారులు ఈ అవకాశాన్ని వినియోగించు కోవాలని కోరారు.


వెంకట తిలక్

టిడిపి ఏజెంట్లకు శిక్షణ

ప్రజాశక్తి- ఆమదాలవలస/కొత్తూరు
మంగళగిరి టిడిపి కార్యాలయంలో నిర్వహించిన ఒక్క లెక్కింపు ఏజెంట్ల ఒక్కరోజు శిక్షణ కార్యక్రమానికి సరుబుజ్జిలి మండలం షలంత్రికి చెందిన రాష్ట్ర టిడిపి కార్యదర్శి శిల్లాల సూర్యనారాయణ, కొత్తూరు మండలానికి చెందిన లోతుగెడ్డ తులసీ వరప్రసాదరావు పాల్గొన్నారు. సూర్యనారాయణ ఫోన్‌లో మాట్లాడుతూ రాష్ట్ర సీనియర్ టిడిపి నాయకులు యనమల రామకృష్ణుడు, పట్టాభి, అశోక్ బాబు సెషన్‌లో పలు సూచనలు చేశారని సూర్యనారాయణ తెలిపారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి

ప్రజాశక్తి- ఆమదాలవలస
మండలంలోని దూసి గ్రామ సమీపంలో సుమారు 45 ఏళ్ల వయసు గల గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్లు ఎస్ఐ కె.వెంకటేష్ తెలిపారు. శుక్రవారం దూసి విఆర్‌ఒ డి. రాజులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు వెళ్లి పరిశీలించగా దూసి రైల్వే స్టేషన్ సమీపంలో ఉన్న జీడి తోటలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం పడి ఉండటాన్ని గుర్తించడం జరిగిందన్నారు. దీనిపై కేసు నమోదు చేసి మృతదేహాన్ని జిల్లా కేంద్రంలోని సర్వజన ఆస్పత్రిలో భద్రపరచడం జరిగిందన్నారు. మృతునికి సంబంధించిన వివరాలు తెలిసిన వారు ఆమదాలవలస పోలీసులను సంప్రదించాలని ఎస్ఐ తెలిపారు.

గుర్తు తెలియని మృతదేహం

ర్యాలీ నిర్వహిస్తున్న పోలీసులు

చాపరలో కార్డాన్‌సెర్చ్

మెళియాపుట్టి : ఈ నెల 4న ఎన్నికల కౌంటింగ్ దృష్ట్యా మండలంలోని చాపరలో పోలీసులు శుక్రవారం కార్డాన్‌సెర్చ్ నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి వివరాలు సేకరించారు. ఎటువంటి అల్లర్లకు పాల్పడవద్దని అవగాహనా ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పాతపట్నం సిఐ నల్లి సాయి, మెళియాపుట్టి ఎస్ఐ టి.రాజేష్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ముగిసిన 'పది' పరీక్షలు

టెక్కలి : ప్రభుత్వ విద్యాశాఖ ఆధ్వర్యాన నిర్వహించిన పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలు శుక్రవారంతో ముగిశాయి. స్థానిక జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల్లో నిర్వహించిన ఈ పరీక్షలు ఈ నెల 24 నుంచి ప్రారంభమై సాంఘీకశాస్త్రం పరీక్షతో ముగిశాయి. ఈ పరీక్షకు 122 మంది హాజరు కావాల్సి ఉండగా, 66 మంది గైర్హాజరయ్యారు. చీఫ్ సూపరింటెండెంట్‌గా ఉత్తరకవాటం గణపతిరావు, డిపార్ట్‌మెంట్ అధికారిగా శ్రీనివాస్‌దాస్‌లు వ్యవహరించారు. కాగా, ఇప్పటి వరకు జరిగిన పది సప్లిమెంటరీ పరీక్షకు ఎక్కువ శాతం మంది విద్యార్థులు గైర్హాజరు కావడం గమనార్హం.

వ్యక్తిగత పరిశుభ్రతపై శ్రద్ధ చూపాలి

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు
కిశోర బాలికలు వ్యక్తిగత పరిశుభ్రతపై ప్రత్యేక శ్రద్ధ కనబరచాలని కాశీబుగ్గ ఐసిడిఎస్ ప్రాజెక్టు పిఒ డి.శారదాదేవి అన్నారు. ప్రపంచ రుతుక్రమం, ఆరోగ్యం, పరిశుభ్రత దినోత్సవం సందర్భంగా శుక్రవారం వజ్రపుకొత్తూరులో అంగన్వాడీ కార్యకర్తలు ర్యాలీ నిర్వహించారు. అనంతరం మండల మహిళా సమాఖ్య భవన్‌లో సమావేశం నిర్వహించి మాట్లాడారు. కిశోర బాలికలు వ్యక్తిగత పరిశుభ్రత పాటించేవిధంగా తల్లులకు అవగాహన పెంచాలని అన్నారు. నెలసరి సమయంలో నీరు ఎక్కువ తాగకుంటే కడుపు నొప్పి సమస్యలు ఇబ్బంది పెడతాయన్నారు. మరుగుదొడ్లు ఉపయోగించిన తరువాత జననేంద్రియాల పరిశుభ్రత చేసుకోవాలని తెలిపారు. నడక, యోగా వంటి సాధారణ వ్యాయామాలు చేయడం కొనసాగించాలన్నారు. బాలికల విద్యను ప్రోత్సహించడానికి సహకరించాలని కోరారు. సూపర్‌వైజర్లు గంగమ్మ, ధనలక్ష్మి, లత, జయమ్మ పాల్గొన్నారు.

ఆన్‌లైన్‌లో డిగ్రీ ప్రవేశాలు

టెక్కలి : టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మొదటి సంవత్సరంలో ప్రవేశాలు పొందాలనుకునే విద్యార్థులు ఆన్‌లైన్ ద్వారా ప్రవేశాలు పొందవచ్చునని ప్రిన్సిపాల్ డాక్టర్ తెంబూరు గోవిందమ్మ ఒక ప్రకటనలో తెలిపారు. 2024-25లో ఇంటర్మీడియట్ పూర్తిచేసిన వారు తత్సమాన అర్హత కలిగిన వారు ప్రవేశానికి అర్హులని అన్నారు. జూన్ 18 నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తు నమోదు చేసుకునేందుకు అవకాశం కల్పించామన్నారు. ఇక్కడ ప్రవేశం పొందిన దూరప్రాంత విద్యార్థులకు వసతి సదుపాయం కల్పిస్తున్నామని తెలిపారు. కళాశాల పనిచేసే సమయంలో సంప్రదించాలని అన్నారు.

గోవిందమ్మ, ప్రిన్సిపాల్

వికలాంగుడితో అంగన్వాడీ సిబ్బంది

వికలాంగ పిల్లల గుర్తింపు

ఇచ్ఛాపురం : మండలంలోని వికలాంగుల పిల్లలను గుర్తింపునకు సమగ్ర శిక్షా అభియాన్ ఆధ్వర్యాన ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నామని ఎంఇఒ అప్పారావు తెలిపారు. వార్డు, గ్రామ సచివాలయాల్లో, అంగన్వాడీ కేంద్రాల పరిధిలోని ఇంటింటికి వెళ్లి శుక్రవారం వికలాంగుల పిల్లలను గుర్తించామని అన్నారు. భవిత కేంద్రాల్లో వివిధ సేవలు అందిస్తున్నట్లు తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. మండల సాహిత ఉపాధ్యాయులు సూర్యం, సోమేష్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎంపిడిఒ శ్రీనివాసరెడ్డి

పక్కాగా పింఛన్ల పంపిణీ

ప్రజాశక్తి- కవిటి
పింఛన్ల పంపిణీలో ఎటువంటి అవాంతరాలు లేకుండా పక్కాగా పంపిణీ చేయాలని ఎంపిడిఒ శ్రీనివాసరెడ్డి సూచించారు. మండలంలోని కార్య దర్శులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. మండలంలోని 11,618 పింఛన్లలో బ్యాంకు ఖాతా లేనివారు 2,550 మంది ఉన్నట్లు తెలిపారు. వీరికి ఇంటివద్దకే వెళ్లి పింఛన్లు అందించాల్సి ఉందని, మిగతా 9068 మందికి బ్యాంకు ఖాతాలో పింఛన్ డబ్బులు జమ చేస్తారని తెలిపారు. లబ్ధిదారులు ఎవరూ సచివాలయాల వద్దకు రావల్సిన అవసరం లేదని, ప్రతి పంచాయతీలోనూ లబ్ధిదారులకు ఈ విషయం తెలియజేయాలని సూచించారు. ఇఒపిఆర్‌డి శివాజీ పాణిగ్రాహి పాల్గొన్నారు.